మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



## రూ.250 కోట్లతో
# మౌలిక వసతులు

- 80 పనులు పూర్తి
- నగరంలో అన్ని రోడ్లు ఏర్పాట్లు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30 ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు నిర్మిస్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డులలో రూ.3కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణపు పనులకు తెలంగాణ చౌరస్తా వద్ద కోర్టు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని,గత సంవత్సర కాలంలోనే 250కోట్ల రూపాయలతో సిసిరోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కులు, విద్యుత్ దీపాలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని,ఇప్పటికే 80వరకు పనులు పూర్తి అయ్యాయని ఆయన తెలిపారు. త్వరలో మరిన్ని నిధులు తెచ్చి మహబూబ్‌నగర్ కార్పోరేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహబూబ్‌నగర్ కార్పో రేషన్ మీద ప్రత్యేక అభిమానం ఉందని,మున్సిపాలిటీగా ఉన్న మహబూబ్‌నగర్‌ను మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.ముఖ్యమంత్రి విజన్ 2047 ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని,అదే స్ఫూర్తి తీసుకుని మహబూబ్‌నగర్ విజన్ 2047 ద్వారా మహబూబ్‌నగర్‌ను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని,మౌలిక సదుపాయాలు కల్పిస్తామని,అభివృద్ధికి అత్యధికసంఖ్యలో నిధులు తెచ్చి రానున్న మూడు,నాలుగుసంవత్సరాలకాలంలో ఎన్నడూలేనివిధంగా మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లాగ్రంథాలయ సంస్థచైర్మన్ మల్లునర్సింహ్మా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్,కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, ఎన్ పి వెంకటేష్,డిసిసి ప్రధానకార్యదర్శి సిరాజ్ ఖాద్రీ,బుద్దారం సుధాకర్ రెడ్డి,సిజె బెనహర్,ఏర్పుల నాగరాజు,అజ్మత్ అలి,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, పిపి సుదర్శన్ రెడ్డి, జిపి శ్రీనివాస్ గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంత రెడ్డి, శ్రీధర్ రావు, కుర్మయ్య పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన
# పరిష్కరించాలి

**నారాయణ పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

**నారాయణ పేట, జూన్ 30 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు.ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 46 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమసమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ ట్రైని కలెక్టర్ ప్రణయ్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో (46) దరఖాస్తులు

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్


**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త:** ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారలకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి కలెక్టరు (46) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదే విధంగా తిరస్కరించే ధరఖాస్తుల గురించి అర్జీదారులకు ఎందుకు తిరస్కరిస్తున్నామనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





| కేటగిరి | ఫీజు |
|---|---|
| అడ్మిషన్ | రూ.2000-5000 |
| బుక్స్ | రూ.1500-6000 |
| యూనిఫాం | రూ.1500-3500 |
| స్కూల్ బస్సు | రూ.10-25వేలు |
| ట్యూషన్ ఫీజు | రూ.10వేల నుంచి లక్ష వరకు (తరగతిని బట్టి) |

## ఆ పాఠశాలల
# లెక్కలే వేరు..



పాఠశాలల పేరు ఏదైతేనేం..వారిదంతా ఒకటే లెక్క. ట్యూషన్ ఫీజు, అడ్మిషన్, బుక్స్, బస్సు,యాక్టివిటిస్, స్కూల్ డ్రెస్సులు,టై బెల్టులు ఇలా రకాల పేర్లతో వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ నిలువునా దోచేస్తున్నారు. విద్యా శాఖ అధికారులు పర్యవేక్షణ సరిగా లేకపోవడం చూసిచూడనట్లు వ్యవహరించడం వల్ల ప్రైవేటు యాజమాన్యాలు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవవహరిస్తున్నారు. పాఠశాలలు ఏ ఒక్క నిబంధన సరిగా అమలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అధిక ఫీజుల వసూళ్లపై ఇప్పటికే పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు , ధర్నాలు నిర్వహించినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం.

*మహబూబ్‌గర్ బ్యూరో, జూన్ 30, ప్రభాతవార్త:*

- తోకల పేర్లతో మాయాజాలం
- సర్కారు నిబంధనలు వారికి పట్టవు
- ట్యూషన్ ఫీజు ఒక ఎత్తు.. మిగతా ఫీజులు మరో ఎత్తు..
- ఎల్‌కేజీకే 50వేలు.. పదో తరగతికి రూ.లక్ష పైనే
- ఇంజినీరింగ్ విద్యను మించుతున్న పాఠశాల విద్య ఖర్చులు
- ముక్కుపిండి వసూలు చేస్తున్న యాజమాన్యాలు
- ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యం

### జిల్లా కేంద్రంలోని ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని చాలా వరకు పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో ఫీజులు వసూలు చేస్తున్నారు. శ్రీ చైతన్య, తక్షశిల, అపెక్స్, పంచవటి, గీతం, నారాయణ, చైతన్య అంటూ కార్పొరేట్ పాఠశాలలో పేరుతో యాజమాన్యాలు నిలువు దోపిడి చేస్తున్నారు. పుస్తకాలు, టై, బెల్టుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అడిగినంత ఫీజులు వసూళ్ల.నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న జిల్లా విద్యా శాఖ అధికారి ఫిర్యాదు చేద్దామంటూ కూడా కనీసం ఫోన్లు కూడా స్పందించడం లేదని ఆరోపణలు లేకపోలేదు. ప్రైమరీ పాఠశాల విద్యార్థి ఫీజులు చెబితేనే ముక్కున వేలేసుకేనే పరిస్థితి ఏర్పడింది. విద్యార్థి అడ్మిషన్ దగ్గనుంచి కళాశాలలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల వరకు విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నారు.

### నిబంధనలు మాకు పట్టవు..

పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. " మాకు నిబంధనలు పట్టవు..జీవోలు సర్క్యులర్‌లు అంటూ చూస్తూ పోతే మేం పాఠశాలలు నడపలేమంటూ తేల్చి చెబుతున్నారు." ట్యూషన్ ఫీజులు పెంచొద్దని ప్రభుత్వం జీవో ఇచ్చినా...యాజమాన్యాలు రకరకాల పేర్లతో అధికంగా గుంజుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఏర్పాటైనా ఇంటర్నేషనల్, పలు కార్పొరేట్ పాఠశాలల్లో 10-15 శాతం పెంచి మరీ వసూలు చేస్తున్నాయి. నెలవారీగా ఫీజులు తీసుకోవాలని ఆదేశించినా అధికశాతం పాఠశాలలు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయి. ఎల్‌కేజీ విద్యార్థులకూ ఆన్‌లైన్ తరగతులంటూ వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నాయి. ఇంతేసి రుసుములు ఎలా చెల్లించాలంటూ పలు పాఠశాలల ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగుతున్నా యంత్రాంగం కదలడం లేదు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిర్దేశించిన ఫీజుల కంటే ఎక్కువ వసూలు చేస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యాహక్కు చట్టం వంటి ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, తమ ఇష్టానుసారంగా నడుస్తున్నాయని విమర్శలు ఉన్నాయి.

### విద్యాహక్కు చట్టం అమలు ఎక్కడా..?

ప్రైవేటే యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు రూ.50వేల నుండి రూ.లక్ష వరకు విద్యార్థుల తల్లిదండ్రులు చెల్లించే ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు, వీటిలో వివిధ కేటగిరి పేరుతో టెక్నో, సి బ్యాచ్, ఐపీఎల్, ప్రత్యేక క్లాసుల పేరుతో ప్రత్యేక ఫీజులు, ప్రత్యేక ప్రైవేటు అందించి విద్యా బోధన చేస్తున్నారు, కనీసం పాఠశాలకు క్రీడా ప్రాంగణం, మరుగుదొడ్లు, మంచినీటి వసతి, వెంటిలేషన్, పరిసరాల శుభ్రత వంటివి యాజమాన్యాల అమలు చేయడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను బడుగుబలహీన వర్గాలు, పీడిత ప్రాంత ప్రజలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పిల్లలకు కేటాయించాల్సి ఉంది. ఇదే విషయాన్ని గతంలో హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఇప్పిటికీ అమలుకు నోచుకోక పోవడం గమనార్హం. విద్యాహక్కు చట్టం సెక్షన్12(1)(సి)ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల కిందటే అంగీకరించింది. ఈ లెక్క ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25శాతం సీట్లను రాష్ట్ర ప్రభుత్వమే పేద విద్యార్థులకు కేటాయించాల్సి ఉంటుంది. సదరు ఫీజును ప్రభుత్వమే యాజమన్యాలకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధన ఇప్పటికే అమలు కావాల్సి ఉండగా వచ్చే విద్యాసంవత్సరం నాటికి అమలు చేస్తామని కోర్టుకు తెలుపడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. అమలు ఎలా చేయాలి, ఎక్కడి నుంచి ప్రారంభించాలో తెలియక సతమవుతున్నట్లు తెలుస్తున్నది. అయితే విద్యాహక్కు చట్టం ప్రభుత్వం కఠినంగా అమలు చేస్తే పేద విద్యార్థులకు న్యాయ జరుగుతుందని, మరింత నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# రోగుల వివరాలు ఆన్‌లైన్ పోర్టల్లో విధిగా నమోదు చేయాలి

**నాణ్యమైన వైద్యం అందించాలి**
**ఆరోగ్యశ్రీ రాష్ట్ర సిఈవో పి. ఉదయ్ కుమార్**
**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఆరోగ్యశ్రీ సిఈవో పి.ఉదయ్ కుమార్, జిల్లా కలెక్టర్

**వనపర్తి,జూన్ 30 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వివరాలు ఆన్లైన్ పోర్టల్లో విధిగా నమోదు చేయాలని రాష్ట్ర ఆరోగ్యశ్రీ సి.ఈ.వో పి. ఉదయ్ కుమార్ ఆదేశించారు. సోమవారం వనపర్తిజిల్లా పర్యటన సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆరోగ్యశ్రీ సిఈఓ పి ఉదయ్‌కుమార్‌కి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం సిఈఓ జిల్లా కలెక్టర్‌తో కలిసి మెడికల్ కళాశాలను సందర్శించారు. వనపర్తి మెడికల్ కళాశాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి,మాతా శిశు వైద్య శాలపై కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి ప్రొజెక్టర్ ద్వారా ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, అవసరం ఉన్న మౌలిక సదుపాయాలపై వివరణ ఇచ్చారు. ప్రొఫెసర్‌లు, అసోసియట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరత ఉందని, విద్యార్థులకు ట్రాన్స్పోర్టేషన్, క్యాడవర్‌ల కొరత ఉందని సి.ఈ.ఓ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సిఈఓ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం వనపర్తి ప్రభుత్వ ఆసు పత్రిని సందర్శించారు. ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించిన సిఈఓ అక్కడ ఉన్న వసతులు, ఎంతమంది డయాలసిస్ చేయించుకుంటున్నారు, ఉన్న సమస్యలు ఏంటని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ సిబ్బందితో మాట్లాడారు. ప్రతి రోజు ఎన్ని ఆరోగ్యశ్రీ క్లెయిమ్‌లు చేస్తున్నారు? అసలు వస్తున్న అవుట్ పేషంట్లు ఎంత ఐ.పి ఎంత ఆరోగ్యశ్రీ ఎంతమందికి ఏ విధంగా నమోదు చేస్తున్నారు, ఉదయాన్నే విధులకు రిపోర్టు చేయగానే ఎవరు ఎలాంటి పనులు చేస్తున్నారు అనే వివరాలు ప్రశ్నించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే కాకుండా అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ సేవలు అందించడం ఆన్లైన్ లో ఎప్పటికప్పుడు నమోదు చేయడం జరగాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని పడకలను సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని అదేవిధంగా రోగుల వివరాలు ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా మెడికల్ కో ఆర్డినేటర్ డా. రమాదేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ కిరణ్మయి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డా. రంగారావు, ఇతర డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు సిఈఓ వెంట ఉన్నారు.

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**మహబూబ్‌గర్ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం**
**కలెక్టరేట్ లో దరఖాస్తుల స్వీకరణ**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, జూన్ 30 :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి . 142 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండల ప్రత్యేక అధికారులు గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు తనిఖీ చేయాలి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలి మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల్లో ప్రతి వారం గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు,కెజిబివిలు, ఆంగన్‌వాడిలు తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం,ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు ఎంపిడిఓలు, తహశీల్దార్‌లు, మండల అధికారులతో పర్యవేక్షణ చేయాలని సూచించారు సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతూ పథకాలు అమలు, అంగన్‌వాడిలలో సౌకర్యాలు, గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు, పరిశుభ్రత తదితర కార్యక్రమాలు పర్యవేక్షించి రిపోర్ట్ చేయాలని సూచించారు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీన్ 2025 కార్యక్రమం కింద గ్రామాలకు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించేలా సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఆప్ ద్వారా తెలిపేలా అవగాహన కలిగించాలని అన్నారు.సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఆప్ ద్వారా ఇప్పించాలని సూచించారు కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, డిఆర్‌డిఓ నర్సింహులు, జడ్‌పి సిఈఓ వెంకట రెడ్డి పాల్గొన్నారు.

## కన్నుల పండువగా
# జగన్నాథ రథయాత్ర



జగన్నాథ్ రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో హరేరామ హరికృష్ణ మందిరం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ బాలాజీ దేవాలయం వద్ద సోమవారం శ్రీ పూరి జగన్నాథ్ స్వామి రథయాత్ర మహోత్సవాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా పూరి జగన్నాథ రథయాత్ర కన్నుల పండుగగా సాగింది. సరాఫ్ బజార్ బాలాజీ మందిరం నుంచి మెయిన్ చౌక్ మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు నిర్వహించారు. రథయాత్రలో భాగంగా భక్తులు హరే రామ హరే కృష్ణ... కృష్ణ కృష్ణ హరే హరే అంటూ నామస్మరణతో భజన సంకీర్తనలతో రథయాత్రను నిర్వహించారు. మహిళలు బతుకమ్మ మాదిరిగా ఆడి పాడారు. పలు ధార్మిక సంస్థల సభ్యులు హాజరై రథయాత్రలో భాగంగా స్వయంగా తాడుతో రథాన్ని లాగారు. రథయాత్ర మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి భీష్మరాజ్ ఫౌండేషన్

– మిగతా4లో..

# జూరాలకు పెరుగుతున్న వరద

- 1,26,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు
- 14గేట్ల ద్వారా దిగువకు నీటివిడుదల

**మహబూబ్‌గర్ బ్యూరో, జూన్ 30, ప్రభాతవార్త:** జూరాల డ్యాంకు వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువ ప్రాంతం నుంచి వరద పోటెత్తడంతో జూరాలకు భారీ ఎత్తున నీరు వచ్చి చేరుతున్నది, దీంతో 14గేట్ల ద్వారా దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల చేశారు. సోమవారం జూరాలకు 1,26,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు అయింది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 7.389 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 26,056 క్యూసెక్కులు స్పిల్ వే ద్వారా 92,680 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడవ కాలువకు 150 క్యూసెక్కులు, కుడి కాలువకు 290 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,20,185 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

నిరుపేద మహిళను నమ్మించి పట్టా పొలం కాజేసి

# ప్రభుత్వ భూమిని ఇచ్చారు

## మోసం చేశారని నిలదీస్తే, చంపుతామని బెదిరింపు

### ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు

**బాలానగర్, జూన్ 30 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని ఉడిత్యాల గ్రామానికి చెందిన చిన్న యాదమ్మకు అదే గ్రామంలో సర్వేనెంబర్ 677లో 0.38 గుంటల పట్టా పొలం ఉంది. అదే గ్రామానికి చెందిన కొందరు మాజీ ప్రజా ప్రతినిధులు యాదమ్మకు మాయ మాటలు చెప్పి పట్టా పొలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆమెకు 966 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని ఇచ్చారు. విషయం తెలిసి మోసం చేశారని నిలదీస్తే, చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని యాదమ్మ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రతినిధుల ఆధీనంలో ఉన్న తన పట్టా పొలాన్ని తనకు ఇప్పించాలని బాధితురాలు కలెక్టర్‌ను వేడుకుంది.

# బాధితులకు న్యాయం చేయాలి

### ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్ చేయాలి : మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 30 ప్రభాతవార్త:** ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమం ద్వారా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటిని చట్టపరమైన దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ డి. జానకి తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 15 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదు విషయాన్ని గమనించి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు నేరుగా ఫోన్ ద్వారా సంప్రదించి, బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రతి వ్యక్తిని గౌరవంతో స్వీకరించి, వినతులను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన విచారణ చేసి న్యాయాన్ని కల్పించడం పోలీస్ శాఖ యొక్క బాధ్యత అని అన్నారు. ఈ విధంగా ప్రజలలో పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక సేవలు అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అంతేకాక, ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల తక్షణ స్పందన, చట్టపరమైన సహాయం అందే అవకాశాలు పెరుగుతాయని ఎస్పీ తెలిపారు.

# పేద ప్రజల కళ్ళల్లో వెలుగులు నింపడమే లక్ష్యం



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, జూన్ 30 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు రాష్ట్ర ప్రణాళిక సంఘము ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రోజు పెబ్బేరు పట్టణ మండలానికి సంబంధించిన 10 మంది బాధితులకు రూ.2,27,500 విలువైన చెక్కులను బాధితులకు వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా బాధితులు అడిగిన వెంటనే స్పందించి వారి కుటుంబాలకు అండగా నిలిచిన సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డికి ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంపురం సహదేవుడు,మన్యం, మండల బిసి సెల్ అధ్యక్షులు వెంకటరత్నం నాయుడు, తోమాలపల్లె కృపాకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఆనంద్ సాగర్, పాతపల్లి చంద్రశేఖర్, విజయ గౌడ్, తిరుపతయ్య, రాము, గంధం అంజి,ఆరిప్,జక్కుల సురేష్, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులు లేకుండా ఇళ్లను ఎలా కూల్చుతారు

### కొడంగల్ బిజెపి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ బంటు రమేష్



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**మద్దూర్, జూన్ 30 ప్రభాతవార్త:** మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేణివట్ల గ్రామంలో రోడ్డు వెడల్పుకు సంబంధించి ఇళ్లను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చి వేస్తారని కొడంగల్ బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ బంటు రమేష్ మద్దూర్ ప్రెస్ క్లబులో విలేకరుల సమావేశంలో అన్నారు. దాదాపు 40 ఇళ్లకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ కమిషనర్ దగ్గర ఉండి ఇళ్లను కూల్చి వేస్తున్నారని ఆయన అన్నారు. నిరుపేదల ఇళ్ళను కూల్చడానికి మీకు ఎటువంటి హక్కులు ఉన్నాయి. కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా ఎలా తొలగిస్తారు అని అన్నారు. వారికి ఇందిరమ్మ ఇళ్లల్లో వారి ఇళ్ళను కట్టించి ఇచ్చేవరకు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. నిరుపేదలకు న్యాయం జరిగే వరకూ వదిలేది లేదన్నారు. వారికి న్యాయం చేస్తే అభివృద్ధికి మేమందరము సహకరిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు భవాని శంకర్, మండల పార్టీ కోశాధికారి రాఘవేంద్ర చారి, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాజాపూర్ గ్రామ బజరంగ్‌దళ్ నూతన కమిటీ ఏర్పాటు



భజరంగ్‌దళ్ నూతన కమిటి

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలో సోమవారం బజరంగ్‌దళ్ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ యువత పెద్ద సంఖ్యలో చేరికలు అయ్యాయి హిందూ ధర్మంకోసం, దేశ సేవకోసం రాజకీయాలకు అతీతంగా ముందుండి పని చేయాలని వరంగల్ జిల్లా అధ్యక్షులు జె.శ్రావణ్ కుమార్ తెలుపడం జరిగింది. సంయోజక్ గా నీలి సురేష్, సహ సంయోజక్‌గా బి. నరేష్, ఏ. తిమ్మప్ప, గో సంరక్షక్ డి.నరేష్, ఎం.అయ్యప్ప బాలు, విద్యార్థి ప్రముఖ్ ఎం.మహేష్, ఎన్. వెంకటేష్, అఖండ్ ప్రముఖ్ ఎం. రాకేష్, ఎం.శ్రీకాంత్, సప్తహిక్ మెల్లన్ టీ. అనిల్. బి. శ్రీను. ఆకాష్, సురక్ష ప్రముఖ్ డి. నర్సింహా, అనిల్, ప్రచార ప్రముఖ్, మోచ పవన్, లక్ష్మణ్, అనిల్, కార్తీక్, విజయ్, మహేష్. శివ యువతతో కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

# పదవీ విరమణ పొందిన ఎస్ఐ బాలబ్రహ్మాం

### శాలువా,పులమాలలతో ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ



పదవి విరమణ పొందిన ఎస్సైని సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 30 ప్రభాతవార్త:** విధి నిర్వహణలో అందరి మన్ననలు అందుకొని పదవీ విరమణ పొందుతున్న ఎస్.ఐ కే.బాలబ్రహ్మాంని సోమవారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం ఘనంగా సత్కరించారు. 1985 బ్యాచ్‌కి చెందిన ఎస్సై బాలబ్రహ్మాం పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుండి వివిధ హోదాల్లో 10 పోలీస్ స్టేషన్లలో 40 సంవత్సరాల సర్వీస్ పూర్తిచేసుకుని పదవి విరమణ పొందుతున్నందున ఎస్సైని కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవి విరమణ పొందుతున్న ఎస్సై బాలబ్రహ్మాం పోలీస్ శాఖలో ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. పోలీస్ శాఖలో ఫిట్‌నెస్ ముఖ్యమని 40 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసి ఇంకా పూర్తిగా ఫిట్‌గా ఉన్నందున ఎస్సైని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, ఆర్ఎస్ఐ శివశంకర్, కుటుంబ సభ్యులు భార్య శ్యామలమ్మ, పిల్లలు మమత, నరేందర్, నందకిషోర్, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై బీజేపీ ధర్నా



ఎమ్మార్వో కిషన్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నేతలు

- తహసీల్దాల్ కార్యాలయం వరకు ర్యాలీ.. వినతిపత్రం సమర్పణ
- హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన కొండా ప్రశాంత్‌రెడ్డి

**భూత్పూర్,జూన్ 30.ప్రభాతవార్త :** రైతులకు ఎకరాకు 15వేల ఇస్తామని ఇంతవరకు ఇవ్వకుండా కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని పేర్కొంటూ సోమవారం బీజేపీ నాయకులు,కార్యకర్తలు భూత్పూర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు.ధర్నాకు దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జీ కొండా ప్రశాంత్‌రెడ్డి నేతృత్వం వహించారు.ఈ సందర్భంగా ధర్నానుద్ధేశించి కొండా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి పద్దెనిమిది నెలలైన ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి,స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రైతు భరోసాను మాత్రమే అమలు చేస్తోందని కొండా ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.వరికి బోనస్ ఇస్తామని చెప్పి ప్రస్తుతం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇవ్వడం ఎంతవరకు సబబని కొండా ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు.అధికారంలోకి వస్తే పంటకు మొత్తంగా రుణమాఫీని వర్తింపజేస్తామని చెప్పి ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఇవ్వకుండా 30నుంచి 50శాతం మాత్రమే రుణమాఫీని ఇచ్చిందని విమర్శించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు రైతు భరోసా పథకం,ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను కాంగ్రెస్ అమలు చేస్తోందని ఆరోపించారు. అనంతరం భూత్పూర్ చౌరస్తా నుంచి తహశీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహశిల్దార్ కిషన్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,బీజేపీ భూత్పూర్ మండల అధ్యక్షుడు గూటం శ్రీను,పట్టణ అధ్యక్షుడు నరసింహ,రాష్ట్ర కార్య వర్గసభ్యుడు రవీందర్‌రెడ్డి,జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మొహ్మద్ ఫారూక్,జిల్లా కార్యదర్శి గాల్‌రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి సత్తయ్య గౌడ్,లిక్కి హరినాథ్‌గౌడ్,ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మేతరి రాము, నాయకులు తిరుపతిరెడ్డి,మల్లికార్జున్‌రెడ్డి, మన్యం,నరేష్‌చారి,సత్యం నాయక్,శంకర్‌నాయక్,శివ,ఆగిరి రవి,మాధవరెడ్డి,పట్నం శ్రీశైలం,ఎంకంపల్లి మల్లేష్,బింబాధర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలను పరిష్కరించాలి

### బిజెపి నాయకుల ధర్నా

**చిన్నచింతకుంట, జూన్ 30 ప్రభాతవార్త:** రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, సన్న వడ్లకు బోనస్ వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి తహసిల్దార్ ఎల్లన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుర్వ రమేష్ మండల అధ్యక్షుడు దశరథ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీలను అధికారం కోసమే ఇచ్చారే తప్ప అమలు చేయడం లేదని వారు మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచిన 30 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. మిగతా 70 మంది రైతులకు తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వడ్లు కొనుగోలు చేసి రెండు నెలలు గడుస్తున్నా నేటి వరకు రైతులకు బోనస్ ఇవ్వలేదన్నారు. వెంటనే రూ.500ల బోనస్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం కింద రైతులకు ఒకటవ విడత మాత్రమే రైతు భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా రెండు విడతల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, రాములు, నరేందర్ జి.నరేష్, మనోహర్, డా. రాము, బాలన్న, బాలస్వామి, శేఖర్, వన్నంనాగేష్ , లంకాల రవి, వినోద్, నవీన్, శంకర్, టిల్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు చేయడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్

**అమరచింత జూన్ 30, ప్రభాతవార్త:** జూరాల ప్రాజెక్టు నుంచి అక్రమంగా సాగునీరు తరలించిన నీచమైన చరిత్ర నీది. గత టిఆర్ఎస్ పాలనఅభివృద్ధి కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? జూరాల ప్రాజెక్టు నుండి అమరచింత, ఆత్మకూరు మండలాల రైతుల పంటలు ఎండిపోతున్న టిఆర్ఎస్ పాలనలో మాజీ మంత్రి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జూరాల ప్రాజెక్టు అధికారులను బెదిరించి అక్రమంగా సాగునీరుని తరలించిన నీచమైన చరిత్ర నిరంజన్ రెడ్డిదేనని డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్ అన్నారు. ఆదివారం అమరచింతలో సాయిచంద్ వర్ధంతి సభలో కాంగ్రెస్ పార్టీపై మాజీ మంత్రి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేసిన విమర్శలకు సోమవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతుంటే ఓర్వలేని టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం తాగదని ఆయన హితువు పలికారు. ఎంపీ ఎన్నికలలో బిజెపితో టిఆర్ఎస్ పార్టీ చీకటి ఒప్పందంతో బిజెపి పార్టీకి అమ్ముడుపోయిన చరిత్ర టిఆర్ఎస్ పార్టీకి ఉందని ఆయన అన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, డాక్టర్ వాకిటి శ్రీహరి రైతులకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యంతో 75 కోట్ల నిధులతో సంగం బండ రాయి పగలగొట్టి రైతులకు సాగు నిలిచిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉందని ఆయన గుర్తు చేశారు. అలాగే జూరాల ప్రాజెక్టు సుందరీ కరణ కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి యనుముల రేవంత్ రెడ్డి 300 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారని 10 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో జూరాల ప్రాజెక్టు ముఖం చూడని నాయకులు ఉన్నారని ఆయన విమర్శించారు. మక్తల్ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు 10 ఏళ్ల పరిపాలనలో జరిగిన అభివృద్ధి 18 నెలల కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిపై టిఆర్ఎస్ నాయకులు చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష కోట్లు దోచుకున్న చరిత్ర టిఆర్ఎస్ కి ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ హాయంలో అమరచింత మండలంలోని ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లతోపాటు రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతులకు బోనస్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుంటే టిఆర్ఎస్ నాయకులకు అభివృద్ధి కనబడడం లేదా అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ పై విమర్శలు మానుకొని అభివృద్ధికి సలహాలు ఇవ్వాలని ఆయన వారిని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, మహంకాళి విష్ణు, తిరుమలేష్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు, విష్ణు, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు, హనుమంతు నాయక్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఏకే వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు శ్యాం కుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రకాశం, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, రాకేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా తౌఫిక్, బాలరాజ్, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో కానరాని పలు శాఖల అధికారులు

### మండలం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

**నవాబుపేట, జూన్ 30 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి మండల అధికారులు హాజరు కాకపోవడం అధికారుల విధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిన అధికారులు, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అందుబాటులో ఉండాలి. కానీ కొంతమంది అధికారులు రాకపోవడం వలన ప్రజల ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంటున్నాయి. మండల అధికారులు తహసిల్దార్, ఎంపీడీవో, ఎంపిఒ, ఏపీవో, ఏపీఎం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, విద్యుత్ శాఖ అధికారి ఏవో, అగ్రికల్చర్ ఏవో, హౌసింగ్ ఏఈ, మెడికల్ ఆఫీసర్, ఎక్సైజ్ శాఖ, విద్యాధికారి, రోడ్లు భవనాల అధికారులు, ఈజీఎస్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ అధికారి, పశు వైద్య అధికారి, మొత్తం దాదాపు 20 శాఖల అధికారులు ప్రజాపాలణలో పాల్గొనాలి. కానీ అధికారులు నాలుగు లేదా ఐదు శాఖల అధికారులు మాత్రమే కనిపించడం ఇతర శాఖల అధికారులు కొందరు ప్రజావాణిలో పాల్గొనకపోవడం విధులపై ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుంది. ప్రజావాణి అనేది ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం. ప్రతి సోమవారము మండల రెవెన్యూ కార్యాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం తమ తమ మండలాలలోనే సమస్యలు పరిష్కరించడానికి ప్రజావాణి ఏర్పాటు చేసింది. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలి. కానీ, మండల అధికారులు కొన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదు. దీని వలన ప్రజల ఫిర్యాదులు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో, అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని కూడా తెలుస్తోంది. ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాని అధికారుల కారణంగా, ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇది ప్రజలలో ప్రభుత్వ అధికారుల పట్ల నమ్మకాన్ని తగ్గిస్తుంది. అధికారులు ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలి, ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి.

# అంటరాని తనం నిర్మూలిద్దాం

### కంసానిపల్లిలో దళితులచే ఆలయ ప్రవేశం



కంసానిపల్లిలో దళితులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

**ఉప్పునుంతల, జూన్ 30 ప్రభాతవార్త :** అంటరానితనం నిర్మూలిద్దాం, మూఢనమ్మకాలను విడనాడాలని మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ బలరాం నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కంసానిపల్లి గ్రామంలో దళితులచే ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేశారు. తదుపరి ఆలయంలో దళితులచే కొబ్బరికాయ కొట్టించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ బలరాం నాయక్, దళితులకు సుల్తాన్, కానిస్టేబుల్ అమర్ సింగ్, దళిత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి చెత్త సేకరణపై అవగాహన

### మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మద్దూర్, జూన్ 30 ప్రభాతవార్త :** మద్దూర్ మున్సిపాలిటీలో సోమవారం ఇంటింటికి చెత్త కార్యక్రమం పై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు తడి,చెత్త పొడి చెత్త పై అవగాహన కల్పించారు. పరిశుభ్రతపై కమిషనర్ ప్రజలకు వివరించి తెలిపారు. మున్సిపాలిలో ప్రజలు ప్రతి ఒక్కరు సహకరిస్తే అధికారులు కూడా సహకరిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముద్ది బీములు, వీరేష్ గౌడ్, చిన్న మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల సమస్యలపై విగ్రహాలకు జర్నలిస్టుల వినతి పత్రాలు



విగ్రహాలకు వినతి పత్రాలు అందజేస్తున్న జర్నలిస్టులు

**కొల్లాపూర్, జూన్ 30 ప్రభాతవార్త :** జర్నలిస్టుల దీర్ఘకాలికమైన ఇండ్ల సమస్యలను పాలకులు పట్టించుకోకపోవడంతో మహనీయులైన బాబు జగ్జీవన్‌రావ్, డా. బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే, టిడబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రామచంద్రయ్య, తాలూకా కన్వీనర్ జలకం మద్దిలేటి జిల్లా నాయకులు మల్లికార్జున సాగర్ సీనియర్ జర్నలిస్టులు బి.కురుమయ్య, సిపి నాయుడు, కారంగి గోవిందు, రమణా జి రావు, పేరుమల్ల స్వామి, మల్లేష్, పరుశురాం, తరుణ్, జల్లాపూర్ సురేందర్, కేశవులు వినతి పత్రాలను అందజేశారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి ఆరవ రోజుకు చేరుకున్నాయి. చిన్న,మధ్య తరహా పత్రికల సంఘం నాయకులు చంద్రశేఖర్‌గౌడ్ దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు అవుట శ్రీనివాసులు, నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షులు గంధం అంతయ్య మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ జిల్లా అధ్యక్షుడు రామచందర్, టిడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటిలు మాట్లాడుతూ సొంత నియోజకవర్గంలోనే ఇండ్ల స్థలాల కోసం శాంతియుతంగా దీక్షలు చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించేంతవరకు దీక్షలు కొనసాగిస్తామని తెలియజేశారు. కొల్లాపూర్‌లో జర్నలిస్టుల సమస్య ఈరోజుది కాదని మూడు దశాబ్దాలకు పైగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పై ఆశ చూపడం కొన్నిసార్లు ప్రొసిడింగ్ కాగితాలు ఇవ్వడం పాలకులు మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తలుచుకుంటే ఒకరోజులో కొల్లాపూర్ నియోజక వర్గంలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కారం చేయవచ్చున్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కారం చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన జర్నలిస్టులు ఉన్నారు.

# అంటరానితనం నేరం: రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాములు



చిన్నమారు గ్రామంలో నిర్వహించిన పౌర దినోత్సవం దృశ్యం

**చిన్నంబావి, జూన్ 30 ప్రభాతవార్త :** మనుషులందరూ ఒకటే అని కులమత భేదాలతో అంటరానితనాన్ని పాటిస్తే నేరమని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాములు అన్నారు. సోమవారం పౌర దినోత్సవ సందర్భంగా మండల పరిధిలోని చిన్నమారు గ్రామపంచాయతిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇప్పటికి గ్రామంలో ఎవరైనా,మిమ్మల్ని కులం పేరుతో దూషించినా, అంటరానితనం పాటించినా, తహసిల్దార్ కార్యాలయంలో పిర్యాదు చేయాలని సూచించారు. కొప్పునూర్ ఎస్సి బాలుర హాస్టల్ వార్డెన్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఒడిశా లోని రాయగడ అనే గ్రామంలో గిరిజన యువతి ఎస్సి కులానికి చెందిన యువకుడు కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారని గ్రామ పెద్దలు నలభై మందికి శిరోముండనం చేసి వారిని కుల బహిష్కరణ చేశారని ఇది సభ్య సమాజం తలదించుకునే అంశం అని, మానవుడు తన విద్యా జ్ఞానంతో ఆకాశంలో పక్షిలా ఎగురగలుగుతున్నడనీ, నీటిలో చేపలా ఈదగలుగుతున్నాడనీ, కానీ తాను నడిచే నడతలో మాత్రం మార్పు రాకపోవడం శోచనీయం.

మన ప్రవర్తనలో, ఆలోచనలో మార్పు వచ్చినప్పుడే నవ సమాజం చూడగలం అన్నారు. ఇప్పటికి మీ గ్రామంలో ఎవరైనా అంటరానితనం పాటించినా, టీ హోటల్స్‌లలో రెండు గ్లాసుల పద్ధతి పాటించినా,దేవాలయాలలోకి ప్రవేశం నిషేదించిన సమీపంలోని పోలీస్ స్టేషన్ లోగాని, మండల రెవెన్యూ కార్యాలయంలో గాని ఫిర్యాదు చేయాలని అన్నారు. అనంతరం, గ్రామంలోని దళిత బిడ్డలు తమ అభిప్రాయాలు చెప్పారు. మా గ్రామంలో ఎవరూ అంటరానితనం పాటించడం లేదని అంతా కలసి,మెలసి ఉన్నామంటూ దళితులంతా ఏకగ్రీవంగా చెప్పడం ప్రశంసనీయం. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ, పంచాయతీ రాజ్, అగ్రికల్చర్, గ్రామ పంచాయతీ సిబ్బంది తో పాటు,కొప్పునూర్ ఎస్సి హాస్టల్ వార్డెన్ రవీందర్ రెడ్డి,గ్రామ దళితులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

**మక్తల్ టౌన్, జూన్ 30 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలోని పలు కాలనీలు మండలంలోని పలు కాలనీలలో అలాగే వివిధ గ్రామాలు చిట్యాల,కర్ని ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ,క్రీడా శాఖ,యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణంలో జాపదం జరగదని ప్రజలలో అవగాహన కల్పించి బిల్లులు సకాలంలో చెల్లించే విధంగా నేనే చర్యలు తీసుకుంటానని గత సభ సమావేశాల్లో చెప్పడంతో మండలంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పునాది పూజలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండల స్థాయిలోని కాంగ్రెస్ నాయకులు అన్ని గ్రామాలలో తిరిగి పట్టణంలోని అన్ని వార్డులలో వారి వార్డుల ముఖ్య నాయకులు ఇండ్ల ముగ్గులు వేసి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ముగ్గులు వేసిన వెంటనే పునాదులు వేసి మొదటి బిల్లు లక్ష రూపాయలు వస్తాయనిలబ్ధిదారులకు అవగాహన కల్పించి వారిని చైతన్యపరిచి ఇళ్లనిర్మాణానికి మనోధైర్యాన్ని కల్పిస్తూ వారికి అండదండగా ఉంటామని తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మక్తల్ మండల అధ్యక్షులు బి.గణేష్ కుమార్, మక్తల్ పట్టణంలో రహీం పటేల్, వెంకట్ రెడ్డి, హోస ముద్దీన్, చిట్యాల గ్రామంలో మాజీ ఎంపిటిసి రామలింగం, చిట్యాల కాంగ్రెస్ నాయకులు అశోక్, రహమత్ పాషా, పుల్లరి, వెంకటప్ప, రామలింగప్ప, ఎల్లప్ప, రాము గ్రామ పెద్దలు లక్ష్మయ్య, మారుతిగౌడ్ కట్ట సురేష్ పాల్గొన్నారు. అలాగే కర్ని గ్రామంలో మాజీ సర్పంచ్ రాఘవేందర్ గౌడ్ మాజీ ఎంపిటిసి రాధా దత్తురామ్ మాజీ ఉపసర్పంచ్ ,కృష్ణయ్య గౌడ్ అలాగే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,భీమేష్ ,నజీమ్ గాసం నరసింహ, అలాగే గ్రామంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,ఆయాగ్రామాల కార్యదర్శులు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## టియుడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**నారాయణపేట టౌన్, జూన్ 30 ప్రభాతవార్త:** హైదరాబాదులోని ఓ న్యూస్ కార్యాలయం పై బిఆర్ఎస్ గుండాలు దాడి చేయడాన్ని నిరసనగ సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో టియుడబ్ల్యూజె (ఐజేయు )ఆధ్వర్యంలో జర్నలిస్టులందరు నల్ల బ్యాడ్జీలతో బైక్ ర్యాలీ నిర్వహించి బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎస్పీ యోగేష్ గౌతమ్ ఫిర్యాదును అందజేసి న్యూస్ ఛానల్ కార్యాలయం పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలియజేయడం జరిగింది. అంతకు ముందు టియుడబ్ల్యూజె ఐజేయు జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డితో బాటు తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన్న మీడియాపై దాడులు చేయడం దారుణం అన్నారు. ఓ న్యూస్ ఛానల్ మీద దాడి చేయడం ప్రజాస్వామ్యం మీద దాడి చేయడం పత్రికల హక్కులను కాపాడటమే అన్నారు.పత్రిక విలేకరులకు ప్రభుత్వమే రక్షణ కల్పించాలన్నారు. దాడికి చేసిన వారిని చట్టపరంగా చర్యలు తీసుకొని వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీ నాయకులు ఇలాంటి దాడులకు పాల్పడే వారిని ప్రోత్సహించడం సిగ్గుచేటు అన్నారు. సమాజంలో పత్రిక విలేకరుల హక్కులను ప్రభుత్వమే కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజెయు సభ్యులతో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యారంగానికి మొట్కర్ లక్ష్మారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం

■ పిఆర్టియు జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి

**ఉట్కూర్, జూన్ 30 ప్రభాతవార్త:** నేడు ఉట్కూరు మండల కేంద్రంలో స్వర్గీయ యం.లక్ష్మారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా పిఆర్టియు టిఎస్ ఉట్కూర్ మండల శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని 250 మంది విద్యార్థులకు విద్యా కానుకగా స్కూల్ బ్యాగులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిఆర్టీయు టీఎస్ జిల్లా అధ్యక్షులు వై. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ లక్ష్మారెడ్డి నిరంతరము ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుటకు కృషి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు బలంగా ఉండాలంటే అక్కడ పనిచేసే ఉపాధ్యాయులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని అభిలషించేవారు. దీనిలో భాగంగా వారు రెండు దశాబ్దాల కాలం ఉపాధ్యాయులకు సేవ చేసి అకాలమరణం చెందటం విద్యారంగానికి తీరనిలోటని అన్నారు. వారి ఆలోచనకు అనుగుణంగా మండలశాఖ లక్ష్మారెడ్డి పదవ తరగతి బ్యాచ్ 1988మిత్రులు కలిసి విద్యార్థులకు బ్యాగులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి మిత్రుడు సూర్య ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉట్కూరుమండల కేంద్రంలో లక్ష్మారెడ్డి సేవలు వెలకట్టలేనివని అన్నారు. అనేకమంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమ య్యారు.వారు స్వర్గానికివెళ్లిఒక సంవత్సరమైందంటే నమ్మలేకపోతున్నామని బాధాతప్త హృదయాలతో మాటాడారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు తిరుపతి,ఉట్కూరు మండలఅధ్యక్షులు కోరం గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి నరసింహా రెడ్డి,వివిధ మండలాల బాధ్యులు ఎం.రఘువీర్, సత్యనారాయణరెడ్డి, బలరాం, తిమ్మన్న, శ్రీనివాసు, జిహెచ్ఎంలు కుసుమ,గౌరమ్మ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సత్యపాల్, గురునాథ్, భాస్కర్,వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పాల్గొని వారికి ఘనంగా నివాళులు అర్పించారు.

## మెడికోలకు స్టైఫండ్ పెంపు హర్షణీయం

◆ మంత్రి దామోదరకు ధన్యవాదాలు తెలిపిన డా. అశ్విని నవదీప్

**మహబూబ్‌నగర్, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ స్టూడెంట్స్ (మెడికోలు) కు స్టైఫండ్ పెంపుపై తెలంగాణ రాష్ట్ర జూనియర్ డాక్టర్ల సంఘం (టి.జుడా) హౌస్ సర్జన్స్ అండర్ గ్రాడ్యుయేట్స్ ప్రతినిధి డా. అశ్విని నవదీప్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బోధనాసుపత్రిలో పనిచేస్తున్న ఇంటర్న్లు, పిజి డాక్టర్లకు, సీనియర్ రెసిడెంట్ల స్టైఫండ్ ఫండ్‌ను 15 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ నెంబర్ 90జారీ చేసిన నేపథ్యంలో టి.జుడా ఆధ్వర్యంలో సంగారెడ్డిలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాను హౌస్ సర్జన్స్, అండర్ గ్రాడ్యుయేట్స్ ప్రతినిధి అశ్విని నవదీప్ మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. మెడికోలకు స్టైఫండ్ పెంచడం డాక్టర్స్‌డే కానుకగా భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం స్పష్టమైన భరోసా కల్పించడం గర్వించదగ్గ విషయమన్నారు. మెడికోల డిమాండ్ల పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమ్మెను విరమింపజేయడం సంతోషదాయకమన్నారు. ఈ మేరకు ఆయన మంత్రి దామోదర రాజనర్సింహా కు డా. అశ్విని నవదీప్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం

◆ ఏఎంసీ చైర్మన్ ముద్ది భీములు

**మద్దూర్, జూన్ 30 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తామని కోస్గి వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు అన్నారు. సోమవారం మద్దూర్ మున్సిపాలిటీ ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ళకు ముగ్గులు వేసి ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి 60 గజాల ఇళ్లను ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అదేవిధంగా రెండో విడతల కూడా ఇల్లు కేటాయిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్,కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరేష్ గౌడ్, వెంకట్ రాములు గౌడ్, చిన్న మల్లికార్జున్, జంగం బాబు, సులగం అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి: కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లాగణపురం. జూన్ 30. ప్రభాతవార్త.** భూమి విషయంలో తగాధపడి వ్యక్తిపై దాడి చేసిన సంఘటన ఉప్పరపల్లి గ్రామంలో చోటుచేసుకుంది పోలీసుల కథనం ప్రకారం ఈనెల 29 సాయంత్రం గ్రామానికి చెందిన కల్వకోలు సుధాకర్ రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద ఉండగా వారి పాలివారైనా కల్వకోలు గో వర్ధన్ రెడ్డితన దగ్గరకు వచ్చి నాకు రావలసిన పొలం మీ భూమిలో ఉంది నా భూమి నాకు కావాలి అని తనతో గొడవపడి బూతు మాటలు తిడుతూ కర్ర తీసుకొని గోవర్ధన్ రెడ్డి తనపై దాడి చేశాడని. చెయ్యి పై గాయం కావడంతో పోలీస్ స్టేషన్లో సుధాకర్ రెడ్డి ఫిర్యాదు చేశాడని కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు.

## రోడ్డు బాగు కోసం కలెక్టర్‌కు వినతి

**మానవపాడు, జూన్ 30 ప్రభాతవార్త :** కాశపురం నుంచి అలంపూర్ ,టీజీ ఫ్యాక్టరీ వరకు రోడ్డు పూర్తిస్థాయిలో దెబ్బతిని ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోడ్డును బాగు చేయాలని జిల్లా కలెక్టర్ సంతోష్‌కు బిజెపి నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి రోడ్డు బాగు చేయుట గురించి వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రయాణించేందుకు వృద్ధులు గర్భిణీ స్త్రీలు, బడికి వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ ద్వారా ఈ రోడ్డు గూండా హాస్పిటల్‌కి సకాలంలో చేరుకోలేక విలువైన ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని దీనిపైన జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని తగు చర్యలు చేపట్టి రోడ్డు మరమ్మత్తులు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, బిజెపి మండల అధ్యక్షులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి : ఎంపీడీవో

**దేవరకద్ర, జూన్30 ప్రభాతవార్త:** ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని కౌకుంట్ల మండల ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. సోమవారం కౌకుంట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివప్రసాద్ మాట్లాడుతూ కౌకుంట్ల మండల ప్రజలందరూ సమస్యలు ఏమున్నా నేరుగా ప్రతి సోమవారం మండల కేంద్రంలో జరిగే ప్రజావాణిలో ఫిర్యాదును అందజేయాలన్నారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులకు సాధ్యమైనంత మేర కార్యాలయంలోనే పరిష్కారం జరుగుతుందని, ఇక్కడ పరిష్కారం కాకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సుందర్ రాజ్, ఏవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలి

■ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



పదవి విరమణ పొందుతున్న ఎస్సై వెంకటేష్ గౌడ్ దంపతులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి క్రైమ్, జూన్ 30 ప్రభాతవార్త :** పదవి విరమణ పొందిన తర్వాత సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలనీ జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్ నుండి ఎస్సై వరకు 37 సంవత్సరాల పాటు విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందుతున్న ఎస్సై, ఎం.వెంకటేష్ గౌడ్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ సమయంలో ప్రతి ఉద్యోగికి సంతోషం, బాధ రెండూ ఉంటాయన్నారు. పదవీ విరమణ తర్వాత ఒక కొత్త జీవితం మొదలవుతుందని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవడం ద్వారా నచ్చిన రంగంలో ముందుకు సాగాలని సూచించారు. పదవీ విరమణ తర్వాత ఖాళీగా ఉంటే నిరుత్సాహం ఏర్పడుతుందని అలా కాకుండా సంతోషంగా కుటుంబంతో గడపాలని చెప్పారు. పదవీ విరమణ తర్వాత వచ్చే మొత్తాలను ప్రయోగాలు చేయకుండా ప్రణాళికాయుతంగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ విరమణ తప్పదని అయితే అదే సమయంలో ఉద్యోగం చేస్తూనే తమ కుటుంబాలను సంతోషంగా ఉండేలా చేసుకున్న పోలీసు అధికారులు ఉద్యోగ విరమణ తర్వాత మరింత చురుకుగా జీవన విధానాన్ని మలచుకోవాలన్నారు. ఏ రంగంలోనైనా కష్టపడి పని చేసినప్పుడే అందుకు తగిన గుర్తింపుతో పాటు ఉన్నత స్థానాలకు చేరుకోగలమన్నారు. పోలీస్ ఉద్యోగం ద్వారా ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం గర్వకారణమన్నారు. న్యాయం కోసం ఎదురు చూసే బాధితులకు అండగా నిలిచే అవకాశం పోలీసు ఉద్యోగం ద్వారా లభిస్తుందని, పోలీస్ ఉద్యోగం ఎంతో ఉన్నతమైనదని చెప్పారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన జీపీఫ్, ఇన్స్యూరెన్స్, భద్రత సాంక్షన్ బిల్స్ అందజేశారు.రావాల్సిన బెనిఫిట్స్‌ను త్వరగా అందేలా చూడాలని సెక్షన్ అధికారులను ఆదేశించారు. ఈ పదవీ విరమణ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి ఇన్చార్జి అదనపు ఎస్పీ, ఉమామహేశ్వరరావు, రిజర్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై, రామేశ్వర్‌రెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కృష్ణ నది తీర ప్రాంత గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

■ గద్వాల జిల్లా ఎస్పీ. శ్రీనివాసరావు



గద్వాల జిల్లా ఎస్పీ. శ్రీనివాసరావు

**గద్వాల టౌన్, జూన్ 30, ప్రభాతవార్త:** జూరాలడ్యాం నుండి 14గేట్లు తెరిచి లక్ష 56వేల క్యూసెక్ ల నీరు దిగువకు వదులుతున్నందున నది తీర ప్రాంత ప్రజలు అప్రమతంగా ఉండాలని ఎస్పీ శ్రీనివాస రావు సూచించారు.నదీతీర గ్రామలలో, పర్యాటక ప్రదేశాలలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఆయా గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండెల చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. కర్ణాటక రాష్ట్రంలో ఎగువ ప్రాంతంలో కురుస్తున్న అధిక వర్షాల కారణంగా పై నుండి వరద ప్రవాహం ఎక్కువగా వున్నందున ఎస్పీ పోలీస్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జూరాల డ్యాం నుండి లక్ష 56 వేల క్యూ సెక్ ల వరద వస్తున్నందున పోలీస్ శాఖ పరంగా చేపట్టవలసిన చర్యల గురించి పోలీస్ అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. అధికారులు ఎప్పటికప్పుడు వాగులు నదులు ఉధృతిని అంచనా వేస్తూ నది తీరా వ్యవసాయ పొలాలలో వున్న రైతులను, గొర్రెలు , పశువుల కాపరులను అప్రమత్తం చేయాలనీ అన్నారు. అలాగే నది తీరానికి మరింత దగ్గర ఉన్న గ్రామాలలో టామ్ టామ్ వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని, నది ప్రవహక ప్రాంతాలలో ప్రధాన పుష్కర ఘాట్లు అయిన బీచుపల్లి, జూరాల డ్యామ్ ఘాట్, గుంది మల్ల లోని పుష్కర ఘాట్ లలో పర్యాటకులు నదిలోకి వెళ్లకుండా హెచ్చరిక బోర్డు లు/ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బందితో 24 గంటలు నది తీరా గ్రామాల్లో గస్తీ ఏర్పాటు చేయాలనీ అధికారులను ఎస్పీ ఆదేశించారు. నది తీరా గ్రామల ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తిన డయల్ 100 కి కాల్ చేయాలని సూచించారు.

# ఇసుక,ఎర్ర మట్టి మీద ఉన్న శ్రద్ధ రహదారుల మరమత్తులపైన లేదు

◆ బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు రామచంద్రరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**అయిజ , జూన్ 30, ప్రభాతవార్త;** జిల్లాలో ఉన్న అధికార పార్టీ నాయకులకు ఇసుక ఎర్రమట్టి దందా మీద ఉన్న శ్రద్ధ రహదారుల మరమ్మత్తులపై లేదని బిజెపి జోలమ్మ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ఇసుక, ఎర్ర మట్టి పరిమితికి మించి తరలించడం తో రహదారులు మొత్తం జిల్లా వ్యాప్తంగా సర్వనాశనమయ్యావెని వాటిని పట్టించుకునే నాధుడే లేదని అన్నారు. అధికార పార్టీ స్థానిక నాయకులు మాత్రం వారి దందా యదేచ్ఛగా కొనసాగిస్తూ 80 పైగా పర్మిషన్ లేని వాహనాలతో ఇసుక మట్టి దొంగ అక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేసుకోవాల్సినటువంటి ఇలాంటి పనులు అక్రమంగా తరలించడం చాలా బాధాకరమని ఇలా అక్రమంగా తరలించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ గండిపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక మరి ఎర్రమట్టి తరలిస్తున్నారని ఇందుకు సంబంధించి జిల్లా అధికారులు చొరవ చూపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అయిజ పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్‌రెడ్డి,ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదన్న, ఉపాధ్యక్షులు ఓబుల్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు వీరేష్ గౌడ్, ఓబీసీమోర్చా అధ్యక్షులుబి.వెంకటేష్, బూత్ అధ్యక్షులు రాజశేఖర్,నరసింహులు,రాజు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ విధానంలో జరిమానాలు స్వీకరించాలి


◆ ప్రతి ఒక్కరికి రశీదు ఇవ్వాలి
◆ మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ

**మహబూబ్‌నగర్, జూన్ 30, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం జిల్లా పోలీసు అధికారి డి.జానకి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పారదర్శకత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, వాహనాల జరిమానా వసూళ్లు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంత్ రెడ్డి ట్రాఫిక్ నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ క్రమపద్ధతులు పాటించడంలో తీసుకుంటున్న చర్యలను గురించి ఆరాతీశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్య జీవితంలో ట్రాఫిక్ పద్ధతులు అత్యంత కీలకమని, రోడ్డు భద్రతే ప్రజల ప్రాణ భద్రత ట్రాఫిక్ సిబ్బంది వాహన దారులకు చట్టంపై అవగాహన కల్పించడంలో, ఆచరణలో పెనాల్టీలను చట్టపరమైన నియమాల ప్రకారం విధించడంలో నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు. ఏవిధంగానూ ప్రజలపై బలవంతపు చర్యలు ఉండకూడదన్నారు.డిజిటల్ మోడ్‌లో జరిమానాల వసూళ్లు జరగాలని, ప్రతి ఒక్కరికి రశీదు ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ట్రాఫిక్ పాయింట్లలో సిబ్బంది అలర్ట్ గా ఉండాలని, ట్రాఫిక్ జామ్‌లను తగ్గించేందుకు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు.

# రైతుల సమస్యల పైన నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**దేవరకద్ర, జూన్ 30 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో రైతుల సమస్యల పైన నిరసన తెలిపి,కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, అర్హులైన రైతులకు రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, సన్న వడ్లకు కింటాల్ కు 500 బోనస్ వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని, కౌకుంట్ల తహసిల్దార్‌కి వినతి పత్రం అందజేసిన భారతీయ జనతా పార్టీ నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుభరోసా పథకంకింద రైతుకు ఒకటవ విడత మాత్రమే రైతుభరోసా ఇవ్వడం జరిగింది.ఇంకా రెండో విడత రైతు భరోసా నిధులు రైతు ఖాతాలో జమ చేయాలన్నారు. రెండు లక్షల రుణమాఫీ 30మాత్రమేజరిగింది. మిగతా రైతులకు కూడా రుణమాఫీ వెంటనే అమలు చేయాలన్నారు. రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలంటే దాదాపు 35 వేల కోట్ల నిధులు అవసరమని, ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేవని అన్నారు. వీటితోపాటుఆరు గ్యారెంటీల అమలుకు మరో లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని తెలిపారు.ఈ నిధులను సమీకరించడంతోపాటు ఆరు గ్యారెంటీల అమలు కోసం విధి విధానాలను రూపొందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు.దీనిని కప్పిపుచ్చుకున్నందుకు స్థానిక సంస్థల ఎన్నికలను తెరపై తీసుకొస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్ర ప్రజలతో పాటు రైతులు తీవ్రమైన సంక్షోభంలో పడిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బడుగుల రాజేశ్వర్ రెడ్డి పాటు వివిధ గ్రామాల భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు డిబిఎఫ్ వినతి

**మక్తల్ టౌన్, జూన్30 ప్రభాతవార్త:** డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ పాల్గొని హైదరాబాదు ఎస్సీఎస్టీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించడం జరిగిందని అధ్యక్షులు పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 180 ప్రైవేట్ పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ ఉచిత విద్యా పథకం కింద ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు డే స్కాలర్, రెసిడెన్షియల్‌లో రూ.26వేలకు పైగావిద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు దాటుతున్న నేటికి పిల్లలను చాలా పాఠశాలలో చేర్చుకోకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు.నేటికీ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేయలేదన్నారు. అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ అధ్యక్షులు పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి గత మూడు సంవత్సరాల 200 కోట్ల పెండింగ్ ఫీజు బకాయిలను చెల్లించి ప్రవేట్ పాఠశాల యాజమానుల వేధింపుల నుండి తల్లిదండ్రులను, పిల్లలను కాపాడాలని ,చదువులు సాఫీగా కొనసాగేలా చూడాలని కోరుతున్నామన్నారు.ఎస్సి,ఎస్టి కమీషన్ స్పందిస్తూ ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తిసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి,వివిధ సంఘాల నాయకులు రాజేష్, శ్రీను, సుధాకర్ ,లింగన్న, బ్యాగరి వేణు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ అనర్హుల జాబితాను కూడా ప్రచురించాలి

**దామరగిద్ద, జూన్30 ప్రభాతవార్త:** దామగిద్ద మండలంలోని రైతులకు రుణమాఫీ అయిన జాబితాను పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగింది. రైతు రుణమాఫీ కానీ అనర్హుల జాబితానుకూడా ప్రదర్శించాలని టిఆర్ఎస్‌సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ బక్కనర్సప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నర్సప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే ప్రజలను మోసం చేసే పార్టీ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అర్హులైన ప్రతి ఒక్కరికి రైతు రుణమాఫీ చేయాలి అని డిమాండ్ చేశారు.

## వీఆర్ఏ వారసుల ముందస్తు అరెస్టు

**దామరగిద్ద, జూన్ 30 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని సోమవారం హైదరాబాద్ సిసిఎల్ఏలో వీఆర్ఏ వారసులకు 81,85 జీవో ప్రకారం మిగిలిపోయిన 3697 వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని సిసిఎల్ దగ్గర శాంతియుత నిరసనకు ప్రోగ్రాం ఉందని ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం విఆర్ఎ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అరెస్ట్ చేసిన వారిలో టి.అచలానందం, బసంత్, కనకప్ప, భీమప్ప, నారాయణమ్మ, తదితరులు ఉన్నారు.

## పురాతన శివాలయాన్ని దర్శించుకున్న రాజ్ కుమార్‌రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, జూన్30 ప్రభాతవార్త:** మండల పరిదిలోని నిడుగుర్తి గ్రామంలోని పురాతన శివాలయాన్ని సోమవారం ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు, దేవాలయ నిర్వాహకులతో కలిసి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్‌రెడ్డి దేవాలయ సందర్శనకు విచ్చేసిన రాజ్ కుమార్ రెడ్డికి డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో దారి పొడువున ఘన స్వాగతం పలికారు. నిర్మాణంలో ఉన్న దేవాలయం గురించి నిర్వాహకులు, గ్రామస్తులు రాజ్‌కుమార్ రెడ్డికి వివరించారు.

## భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్‌కు సన్మానం

**నారాయణపేట టౌన్, జూన్30 ప్రభాతవార్త:** నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామం ప్రధాన రహదారి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపును సోమవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్‌రెడ్డి సందర్శించి పెట్రోల్ పంపు యజమానులతో మాట్లాడారు. అనంతరం పెట్రోల్ పంపు యజమానులు రాజకుమార్‌రెడ్డిని శాలువాతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

## పదవి విరమణ పొందిన నరసింహకు ఘన సన్మానం

**పెబ్బేరు, జోన్30 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ నందు వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహులు, సోమవారం పదవి విరమణ పొందారు. ఈ పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొని వారిని మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షురాలుగౌని ప్రమోదినిరెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కవిత, షాహిన్ బేగం,మోతె రాముడు, రామన్‌గౌడ్, నర్సింహా నాయుడు, ఆంజనేయులు,శంకర్, మార్కెట్ కార్యదర్శి అనిల్ కుమార్, నిరంజనమ్మ, ఆఫీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కేబీఎస్ బ్యాంకు ఆధ్వర్యంలో విద్యార్థులకు షెడ్డు నిర్మాణం

**గద్వాలటౌన్, జూన్30, ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలో గల ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు కేబీఎస్ బ్యాంక్ గద్వాల ఆధ్వర్యంలో , సెంట్రల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ యాక్టివిటీ ద్వారా దాదాపు ఒక లక్ష రూపాయలు విలువగల షెడ్డును విద్యార్థుల కొరకు నిర్మించడం జరిగిందనీ కళాశాల ప్రిన్సిపల్ వీరన్న తెలిపారు. ఇట్టి షెడ్డులో తరగతులు నిర్వహించడం జరుగుతుందనీ, ఈ సహాయ సహకారాలు అందించిన బ్యాంక్ మేనేజర్ గారైన చామర్తి సుధాకర్, అదేవిధంగా మొహమ్మద్ రఫీ బిజినెస్ మార్కెటింగ్ మేనేజర్ ఇందుకు సహాయ సహకారాలు అందించారని వారికి కళాశాల ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు,విద్యార్థులు వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నమన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేత వీరికి సన్మానించడం జరిగిందనీ ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

**దామరగిద్ద, జూన్ 30 ప్రభాతవార్త:** ఆటో వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో దామరగిద్ద మండల తాసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి తహసిల్దార్ తిరుపతయ్యకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జోషి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి మహిళలకు ఫ్రీ బస్సు కారణంగా ఆటో వర్కర్లంతా దివాలా తీసే పరిస్థితి ఏర్పడింది అన్నారు. చదువుకున్న యువత అంతా ఆటోలు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని బస్సులు లేనిగ్రామాల్లో ఆటో వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. ఇట్లాంటి వారికి ప్రభుత్వం వెంటనే ఇస్తానన్న సంవత్సరానికి రూ. 12,000 అలాగే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనిఅన్నారు.ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్ల యూనియన్ నాయకులు భీంషప్ప, నరసింహులు, నరసింహ, హనుమంతు, నరేష్ నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పరుస్తాం

**కల్వకుర్తి, జూన్ 30 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో గ్రామాలను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామని సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారు. వెల్దండ మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 12 విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. స్తంభాలను గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సాయి రెడ్డి, రషీద్, తిరుపతిరెడ్డి, ఎర్రశీను, కిష్టాల్, మారేపల్లి శ్రీను, జంగయ్య, సుమంత్ తదితరులు ఉన్నారు.

## కొల్లూరులో నంగారా భేరి కరపత్రం ఆవిష్కరణ

**నవాబుపేట, జూన్30 ప్రభాతవార్త :** గ్రామాల నుండి తండాలను విడదీసి ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని, మా తాండాలో మా రాజ్యం,అనే నినాదంతో ఆవిర్భవించిన లంబాడి హక్కుల పోరాట సమితి నంగారాభేరి విజయవంతంగా 28 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ప్రతి తాండ ,మండల, జిల్లా కేంద్రాలలో నంగారాభేరి జండా ఆవిష్కరణలు చేసి సంబరాలు జరుపుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విస్లావత్ చందర్ నాయక్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లో జరిగే సభ కరపత్రికను కొల్లూరులో విడుదల చేశారు.ఎన్నో పోరాటాలు, ధర్నాలు, రాస్తారోకోలు, సభలు సైకిల్ యాత్రలు,పాదయాత్రలు చేసిన అప్పటి తెలుగు దేశం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆయన అన్నారు. తర్వాత సుమారు 3000లకు పైగా తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం జరిగిందని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు 6శాతం ఉన్న రిజర్వేషన్‌లను 10 శాతానికి పెంచుకోవడం లంబాడి జాతి విజయమని అన్నారు. మా తాండాలో మా రాజ్యం,నినాదం సాధించుకున్నందున జూలై 1న ప్రతి ఒక్క లంబాడి బిడ్డ సంబరాలు చేసుకోవాలని అన్నారు.

